క్లుప్తంగా

గ్రామ క్షేమాన్ని కాంక్షిస్తూ..



నదికి బయలుదేరిన హలిగేర గ్రామస్తులు

ఆస్పరి: సమృద్ధిగా వర్షాలు కురిసి, పుష్కలంగా పంటలు పండి గ్రామస్తులంతా సంతోషంగా ఉండాలని హలిగేర గ్రామస్తులు ఏటా తుంగభద్ర నదికి వెళ్లి జలాలను తీసుకొచ్చి గ్రామంలోని ఆయా ఆలయాల్లోని స్వామి వార్లను అభిషేకించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శనివారం గ్రామస్తులు ఊరేగింపుగా మంత్రాలయం మండలం వద్ద ప్రవహిస్తున్న తుంగభద్ర నదికి జలాల కోసం పాదయాత్ర వెళ్లారు. ముందుగా గ్రామంలోని ఆంజనేయ, ఈశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరు సోమవార గ్రామం చేరుకొని నది నీటితో స్వాములను అభిషేకించి విశేష పూజలు చేపడతారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది.

ఇన్‌చార్జ్ డీఎస్పీగా శ్రీనివాస చారి

తుగ్గలి(పత్తికొండ) : పత్తికొండ ఇన్‌చార్జ్ డీఎస్పీగా శ్రీనివాస చారి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ విధులు నిర్వహించిన డీఎస్పీ శ్రీనివాసరెడ్డి కర్నూలుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జ్ డీఎస్పీగా కర్నూలు మహిళా పీఎస్ డీఎస్పీ శ్రీనివాస చారిని ఉన్నతాధికారులు ఇక్కడ నియమించారు.

పండ్లతోటలపై అవగాహన

మద్దికెర : ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలను సంరక్షించుకోవాలని ఉపాధి ఏపీఓ నర్సిరెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని బొజ్జనాయునిపేట గ్రామంలో పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. అధికారుల సూచనల మేరకు పండ్ల తోటల నిర్వహణ బట్టి మూడేళ్లపాటు ప్రభుత్వం ఖర్చులు చెల్లిస్తుందన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీఏ వెంకటేశ్వరెడ్డి, రాఘవేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్ ఉన్నారు.

ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

తుగ్గలి(పత్తికొండ) : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 67వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం పట్టణంలో పాత్రికేయులు ఘనంగా నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాలుగు స్తంభాల కూడలిలో యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య మాట్లాడుతూ సమాజాన్ని ప్రభావితం చేయగలిగే శక్తి ఒక్క పాత్రికేయులకే ఉందన్నారు. వివిధ పార్టీల నాయకులు, ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు సాలురంగడు, పాత్రికేయులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో మృతిచెందిన అలిగిరి బోయ మల్లికార్జున

దేవనకొండ: మండంలోని పి.కోటకొండ-బేతపల్లి గ్రామాల మధ్య శనివారం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. వివరాలు.. కోడుమూరు మండలం కల్లపరి గ్రామానికి చెందిన అలిగిరి బోయ మల్లికార్జున(36) శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ట్రాక్టర్ (ఇంజిన్ నంబర్ 3105ఈఎల్‌వీ34కే1376907ఎఫ్20, చాసిస్ నంబర్ బీజెడ్‌వీఎస్‌పీ139237053) టైర్లు వేసుకుని బేతపల్లి నుంచి ఈదుల దేవరబండ వైపు వస్తుండగా బేతపల్లి గ్రామంలోని బోయకొండయ్య పత్తి పొలం వద్ద మలుపు తిప్పే క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడింది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో మల్లికార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి అలిగిరి బోయ రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

వర్షపు నీరు వెళ్లేదెలా?



గోవిందప్ప స్వామి కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

చిప్పగిరి: డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో తేలికపాటి వర్షానికే మండల కేంద్రంలోని అనేక కాలనీల్లోని ప్రధాన రహదారిలో వర్షపు నీరు నిలిచిపోతుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిలిచిన నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవంతో ఇళ్ల మధ్యన రోజుల తరబడి నిలిచి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. ఇక కొన్ని చోట్ల గుంతల్లో నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. వీధుల్లో నీరు నిల్వ కుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముండటంతో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉప్పొంగిన వేదావతి




ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు మార్లమడికి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వేదావతి (హగరి) నది

హొళగుంద: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులోని మార్లమడికి వద్ద ఉన్న వేదావతి (హగరి) నది శనివారం ఉప్పొంగి ప్రవహించింది. ఇన్నాళ్లు వర్షాలు లేక కళావిహీనంగా ఉన్న నదికి వరద నీరు రావడంతో సమీప గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నది పరివాహకంలోని అటు కర్ణాటక, ఇటు ఆంధ్రా పరిధిలో కురిసిన వర్షానికి నదిలో ప్రవాహం మొదలైంది. దీంతో నది ఇరువైపుల ఉన్న రైతులు నదిలో ఏర్పాటు చేసుకున్న మోటార్లతో నీటిని పొలాలకు మళ్లిస్తున్నారు. ఇప్పటికే వరి, మిరప, పత్తి, చెరకు తదితర పంటలను సాగు చేశారు. ఈ ఏడాది నదిలో నీరు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొద్ది రోజులుగా నది ఎగువ భాగంలో వర్షాలు కురుస్తుండటంతో వరద ప్రవాహంతో కళకళలాడుతోంది. ఉధృతి ఇంకా పెరిగే అవకాశముందని సమీప ప్రాంతాల ప్రజలు పేర్కొంటున్నారు.

నిలిచిన రాకపోకలు

హాలహర్వి: కర్ణాటక రాష్ట్రంలో వర్షాలు కురుస్తుండడంతో హాలహర్వి మండలంలోని గూళ్యం గ్రామం వద్ద వేదావతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు రాకపోకలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. నదిలో ప్రవాహం పెరగడంతో కర్ణాటకలోని బళ్లారి, శిరుగుప్ప వంటి ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అవతలి వైపు వెళ్లాలంటే నీటిలో పుట్టీలు వేసుకుని ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న వేదావతి నదిలో ప్రమాదకరంగా పుట్టీలో ప్రయాణిస్తున్న ప్రజలు

ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యం

తుగ్గలి(పత్తికొండ) : ఖాతాదారుల శ్రేయస్సే లక్ష్యంగా యూనియన్ బ్యాంకు పనిచేస్తోందని ఆ బ్యాంకు కర్నూలు రీజనల్ హెడ్ నరసింహారావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలో లక్ష్మీథియేటర్ ముందు నిర్మించిన నూతన కాంప్లెక్స్ భవనంలోకి బ్యాంకును మార్చారు. ఈ సందర్భంగా కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డితో కలిసి ఆయన పూజా కార్యక్రమాలు నిర్వహించి బ్యాంకును ప్రారంభించారు. నరసింహారావు మాట్లాడుతూ డిపాజిట్లపై రూ.7.40 శాతం అత్యధిక వడ్డీరేటు ఇస్తున్న ఏకైక బ్యాంకు తమదేనన్నారు. సరసమైన వడ్డీరేట్లతో రుణాలు అందిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చీఫ్ మేనేజర్ శేషగిరిరావు, మేనేజర్ భానుప్రకాష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



నూతన బ్యాంక్ ప్రారంభోత్సవంలో నరసింహారావు

హిందువులపై దాడులను అరికట్టాలి

ఆలూరు: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు అడ్డుకట్ట వేయాలని హిందూ రామసేతువు కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చిన కార్యకర్తలు, నాయకులు తదితరులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు నందకిశోర్‌రెడ్డి,ఈరన్న,రామయ్య, ఈరప్ప మాట్లాడుతూ.. ఆ దేశ ప్రతినిధులతో దౌత్య వర్గాలు చర్చలు జరిపి అక్కడి హిందువులను రక్షించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

టీబీ డ్యాం ఇంజినీర్ల పనితీరు అద్భుతం

ఆలూరు: ఈనెల 10న తుంగభద్ర జలాశయం 19 గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. అయితే గేటు ఏర్పాటులో డ్యాం ఇంజినీర్లు అద్భుతమైన పనితీరు ప్రదర్శించి ఆదర్శంగా నిలిచారని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అభినందించారు. శనివారం ఆయన మాట్లాడుతూ 19వ గేటును నీటి ప్రవాహం కొనసాగుతుండగానే గేట్ల తయారీ నిపుణుడు కన్నయ్యనాయుడు పర్యవేక్షణలో ఇంజినీర్లు తక్కువ సమయంలోనే గేటు అమర్చడం అభినందనీయమన్నారు. వారి కృషి ఫలితంగా కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల రైతాంగం ఊపిరి పీల్చుకున్నారని చెప్పారు.

ఎస్‌ఎంసీ ఎన్నికల్లో టీడీపీ నేతల చిల్లర చేష్టలు..

స్కూల్ పేరెంట్స్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ నాయకులు చిల్లర చేష్టలకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను మభ్య పెట్టేలా బెదిరింపులకు పాల్పడి తమకు నచ్చిన వారిని చైర్మన్లుగా నియమించుకోవడం దారుణమని ఆక్షేపించారు. పాఠశాలల అభివృద్ధికి తోడ్పడే వారిని కాకుండా తమ పార్టీ నాయకులకు పదవులు పంచిపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బకాయిదారులకు నోటీసులివ్వండి

ఆలూరు: పత్తికొండ,ఆలూరు నియోజకవర్గాల్లోని గ్రామ పంచాయతీల్లో బకాయిలను చెల్లించని వారికి వెంటనే నోటీసులు అందజేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామని పత్తికొండ డివిజన్ పంచాయతీ అధికారి ప్రకాష్‌నాయుడు తెలిపారు. శనివారం ఆయన ఆలూరులో మాట్లాడారు. పత్తికొండ, ఆలూరు నియోజకర్గాల్లోని పంచాయతీల్లో ట్యాక్స్, నాన్‌ట్యాక్స్ రెండు రకాలుగా పన్నులు వసూళ్లు చేస్తున్నామన్నారు. గత ఏడాది దాదాపు రూ.6 కోట్లకు గాను రూ.5 కోట్ల వరకు ఇంటి, నీటితీరువా పన్నులను వసూళ్లు చేశామన్నారు. 2024-25 సంత్సరానికి గాను రూ.6.5 కోట్ల వరకు ఆర్థిక బడ్జెట్ ప్రణాళికను రూపొందిస్తున్నామని చెప్పారు.మేజర్ గ్రామపంచాయతీల్లో ఇంటి పన్ను, కుళాయిలు, పెంట దిబ్బల స్థలాలకు, పిండి మిషన్లతో పాటు, కారం మిషన్లు, కుటీర పరిశ్రమలైన ఇస్తరాకులు, బీడీ, చుట్ట తయారీదారుల స్థలాలకు పన్నులు వేయాలని పీఎస్‌లను ఆదేశించారు.

బెల్లం ఊట ధ్వంసం

తుగ్గలి : జేఎం తండా పరిసరాల్లో నాటు స్థావరాలపై సెబ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. సీఐ సువర్ణలత, ఎస్‌ఐ కార్తీక్‌సాగర్ ఆధ్వర్యంలో జరిపిన దాడుల్లో 70 లీటర్ల నాటు సారా, 2,200 బెల్లం ఊటను ధ్వంసం చేశారు. పారిపోతున్న వ్యక్తిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరుకుంద క్షేత్రంలో భక్తుల సందడి



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రెండో శనివారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి భక్తులు ఉదయం నుంచే తరలివచ్చారు. దీంతో స్వామి క్షేత్రంలో సందడి నెలకుంది. శ్రావణ మాసంలో శనివారం కూడా అధికంగా స్వామి సన్నిధిలో గడపడానికి రావడంతో ఎటూ చూసినా భక్తులే కనిపించారు. ఉదయం నుంచే భక్తులు క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, వీఐపీ దర్శనం కల్పించడంతో దర్శనం సాఫీగా సాగుతోంది. తెల్లవారు జామున స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి సన్నిధిలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కృష్ణగిరిలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది



మద్దికెరలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ఆస్పరిలో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది



పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు



ఆలూరు అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది



దేవనకొండ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిరసన తెలియజేస్తున్న వైద్యాధికారులు, వైద్య సిబ్బంది

కృష్ణగిరి: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ప్లకార్డులతో శనివారం నిరసన వ్యక్తం చేశారు. వైద్యాధికారి ప్రదీప్ మాట్లాడుతూ ఈ కేసుకు సంబంధించి విచారణ త్వరగా పూర్తి చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్య సిబ్బందికి పూర్తి భద్రత కల్పించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి గజేంద్రా రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్దికెర: కోల్‌కతాలోని ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీలో విధులు నిర్వహిస్తున్న ట్రైనీ జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసిన నిందితులను బహిరంగంగా ఉరి తీయాలని ప్రభుత్వ వైద్యాధికారిణి రాగిణి, విద్యాసాయి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ సునీత, కరస్పాండెంట్ మాధవ్ డిమాండు చేశారు. ఘటనను నిరసిస్తూ శనివారం మద్దికెరలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రధాన కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి న్యాయం చేయాలని నినదించారు. సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, పర్యవేక్షకులు సూర్యనారాయణ, కృష్ణమ్మ, జూనియర్ అసిస్టెంట్ సురేంద్ర, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్పరి: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్లు దుర్గాబాయి, బాలకృష్ణారెడ్డి, వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు.

తుగ్గలి : కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన ఘటన గర్హనీయమని వైద్యులు పేర్కొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, సిబ్బంది నిరసన ర్యాలీ చేపట్టారు. సీనియర్ వైద్యులు సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు కల్పన మాట్లాడుతూ.. దేశంలో వైద్యులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ముఖ్యంగా మహిళా వైద్యులకు రక్షణ కరువైందన్నారు. అలాగే తుగ్గలి పీహెచ్‌సీ వద్ద వైద్యులు ప్రవీణ్, సిబ్బంది నిరసన చేపట్టారు. వైద్యులు ఆదినగేష్, హారిక, వెంకటేశ్వర్లు, రాజేష్, ఆర్‌ఎంపీలు, మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెక్క నాగరాజు, బొంతల రంగా, మెడికల్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: దేశంలో వైద్యులకు రక్షణకు కరువైందంటూ వైద్యులు ఫైజున్నిసా, వాహిద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో డాక్టర్ అత్యాచార ఘటనకు నిరసనగా శనివారం ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యారోగ్య సిబ్బంది రోడ్డెక్కారు. ఓపీ సేవలు నిలిపివేసి ర్యాలీ నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆసుపత్రి నుంచి ర్యాలీగా వచ్చి స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేసి మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైద్యులు రామకృష్ణ సిబ్బంది హెడ్ నర్స్ నిర్మల, స్టాఫ్ నర్సులు హసీనాబీ, పరిమళ, దివ్య,పుల్లమ్మ, మంగమ్మ,టీబీ సూపర్‌వైజర్ గోపాల్,పాములేటి,భాను ప్రకాష్ పాల్గొన్నారు.

దేవనకొండ: కోల్‌కతా ఆర్‌జీకర్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యురాలికి జరిగిన అమానుష చర్యను దేవనకొండ పీహెచ్‌సీ వైద్యాధికారులు కళ్యాణ్, విజయ్‌భాస్కర్ ఖండించారు. ఇందుకు నిరసనగా శనివారం వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలతో ఓపీ సేవలను నిలిపి నిరసన వ్యక్తం చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు సాయిబాబా, రంగస్వామి, శ్రీధర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తుగ్గలి(పత్తికొండ) : స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు గడిచినా దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఇండియన్ అసోసియేషన్స్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్)రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.సురేంద్రకుమార్ అన్నారు. శనివారం ఆయన పత్తికొండలో మాట్లాడుతూ.. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య బాధాకరమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు వైద్యుల భద్రతను పటిష్టం చేసే రీతిలో చట్టంలో మార్పులు తీసుకురావాలని కోరారు. ఇలాంటి కేసుల్లో నిందితుల తరుపున న్యాయవాదులెవరూ వాదించకుండా బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తీర్మానం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆధ్యాత్మికం

కౌలుట్ల చెన్నకేశవస్వామికి విశేష పూజలు



స్వామివారిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో వెలిసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ కౌలుట్ల చెన్నకేశవస్వామి వారికి శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో కొందరు భక్తులు తలనీలాలు సమర్పించారు. ముందుగా ఆలయ ద్వార పాలకుడు శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు చెల్లిచెలిమల వెంకటేష్, బేతంచర్ల వాస్తవ్యులు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ ఆర్.హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేయించారు. హనుమంతరెడ్డి మాట్లాడుతూ మూడో శనివారం సందర్భంగా గరుడ వాహనసేవ, నాలుగో శనివారం గజవాహనసేవ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. కమిటీ మెంబర్ ఆర్.వెంకటేశ్వరరెడ్డి, పూజారులు మురళీ, అరవింద్ పాల్గొన్నారు.

గిడ్డాంజనేయ స్వామికి శ్రావణమాస పూజలు



కలశాన్ని ఊరేగింపుగా తెస్తున్న అర్చకులు

మద్దికెర : స్థానిక గిడ్డయ్య వీధిలో వెలసిన శ్రీగిడ్డాంజనేయ స్వామికి శ్రావణ మాస రెండవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆచారం ప్రకారం స్వామి వారికి గ్రామానికి 4 కి.మీ దూరంలోనున్న దేవిరెడ్డి బావి నుంచి మధుసూదనా చార్యులు కలశంలో నీటిని తీసుకొని తలపై ఉంచుకొని పురవీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగింపుగా ఆలయం చేరుకున్నారు. ఆ నీటితో స్వామివారిని అభిషేకించి నిత్య పూజలతో పాలు విశేష పూజలు చేపట్టారు. చివరగా నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తాదులు పాల్గొన్నారు.

రంగనాథుడికి ప్రత్యేక పూజలు

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి ఉదయం బిందె సేవ అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ఆవరణలో ప్రదక్షిణ చేపట్టారు. శ్రావణమాసం రెండవ శనివారం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మహామంగళహారతి ఇచ్చి నైవేద్యం సమర్పించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



విశేష అలంకరణలో స్వామి వారు

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



తుగ్గలిలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు



విరాళాలు సేకరిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

తుగ్గలి : కేరళలోని వయనాడ్‌లో జరిగిన ప్రకృతి విధ్వంసంలో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో శనివారం తుగ్గలిలో విరాళాలు సేకరించారు. బాధితులకు ఆర్థిక సాయం అందించాలనే లక్ష్యంతో కార్యక్రమం చేపట్టామని, దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు కోరారు. సేకరించిన సొమ్ము జిల్లా కమిటీకి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలూరు: కేరళలోని వయనాడ్‌లో గత నెలలో కురిసిన భారీవర్షాలకు సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని ఏపీ రైతు సంఘం ఆలూరు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఈరన్న,హనుమంతు ప్రజలను కోరారు. శనివారం స్థానిక కోటవీధి, కోయినగర్, సిద్ధేశ్వరనగర్, మెయిన్ బజారు తదితర కాలనీల్లో విరాళాలు సేకరించారు.

ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు



అటికెలగుండులో చైర్మన్‌గా ఎన్నికైన గజ్జల నాగేంద్రను అభినందిస్తున్న బాబుల్‌రెడ్డి



చిప్పగిరి జెడ్పీ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా ఎన్నికైన కె.నాగరాజు సన్మానించిన దృశ్యం

తుగ్గలి(పత్తికొండ) : వాయిదా పడిన పాఠశాలల్లో శనివారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. పత్తికొండ మండలం అటికెలగుండులో పోలీసు బందోబస్తు మధ్య ఎన్నిక ఏకగ్రీవమైంది. చైర్మన్‌గా గజ్జల నాగేంద్ర, వైస్ చైర్‌పర్సన్‌గా సరస్వతి ఎన్నికయ్యారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి చైర్మన్, కమిటీ సభ్యులను అభినందించారు. ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాస చారి పాఠశాలకు చేరుకుని ఎన్నికను పర్యవేక్షించారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు బందోబస్తు చేపట్టారు.

తుగ్గలి మండలంలో..

ముక్కెల్లలో జెడ్పీహెచ్‌ఎస్ ఎస్‌ఎంసీ చైర్మన్‌గా మల్లికార్జున, వైస్ చైర్ పర్సన్‌గా వి.సరస్వతి, పెండేకల్లు ప్రాథమిక పాఠశాలలో చైర్మన్‌గా శ్రీనివాసులు, వైస్ చైర్‌పర్సన్‌గా శ్రీలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆస్పరి: మండలంలోని చిన్నహోతూరు గ్రామంలో శనివారం ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈఓ తిరుమలరావు తెలిపారు. చిన్నహోతూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ చైర్మన్‌గా రాజన్న, ప్రాథమిక పాఠశాల, మెయిన్ స్కూల్ చైర్మన్‌గా కుమార్, ఎస్‌డబ్ల్యూహెచ్ స్కూల్ చైర్మన్‌గా లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఆస్పరి సీఐ మస్తాన్‌వలి బందోబస్తు నిర్వహించారు.

మూడు పాఠశాలల్లో ఎన్నిక వాయిదా

కృష్ణగిరి: మండలంలో నాలుగు పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు జరగాల్సి ఉండగా శనివారం మూడు పాఠశాలల్లో ఎన్నిక వాయిదా పడినట్లు ఎంఈఓ-2 మద్దయ్య తెలిపారు. చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా బి.లావణ్య, వైస్ చైర్మన్‌గా బసవరాజు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. లక్కసాగరం గ్రామ పంచాయతీలోని లక్కసాగరం, పందిర్లపల్లె, తెగదొడ్డి గ్రామాల ప్రాథమిక పాఠశాలల్లో మాత్రం మరోమారు ఎన్నిక వాయిదా పడింది.

ముగిసిన ఎస్‌ఎంసీ ఎన్నికలు

చిప్పగిరి: మండలంలో మొత్తం 26 పాఠశాలలు ఉండగా 15 పాఠశాలలలో ఎస్‌ఎంసీ ఎన్నికలు పూర్తి కాగా.. 11 పాఠశాలల్లో వివిధ కారాణాలతో వాయిదా పడ్డాయి. ఆ 11 పాఠశాలల్లో శనివారం ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. అన్ని పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. చిప్పగిరి, డేగులహాలు,నేమకల్లులో చైర్మన్‌లుగా నాగరాజు, దుర్గలక్ష్మి, ఆదినారాయణ, చిప్పగిరి కేజీబీవీ చైర్మన్ గా కె పెద్దక్క తో పాటు మరో ఏడుగురు చైర్మన్‌లుగా, మరో 11 మంది వైస్ చైర్మన్ లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

హొళగుంద: మండలంలో వాయిదా పడిన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలకు సంబంధించి 7 పాఠశాలలుండగా శనివారం మూడు పాఠశాలలకు మాత్రమే ఎన్నికలు జరిపినట్లు ఎంఈఓ-1 సత్యనారాయణ, ఎంఈఓ-2 జగన్నాథం తెలిపారు. ముద్దటమాగి ప్రైమరీ, వందవాగిలిలో రెండు ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు చెప్పారు. గొడవలు జరిగే అవకాశాలున్న హెబ్బటం జెడ్పీ, ప్రాథమిక, ఎల్లార్తి ప్రైమరీ, ఎల్లార్తి హైస్కూళ్లలో వాయిదా వేసినట్లు చెప్పారు. ఎస్‌ఐ బాల నరసింహులు బందోబస్తు నిర్వహించారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఎన్నిక

తుగ్గలి(పత్తికొండ) : పత్తికొండ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, సభ్యులుగా సాంబశివారెడ్డి, సురేష్‌కుమార్, బత్తిన లోక్‌నాథ్, వైద్యాధికారిణి కల్పనను ఎన్నుకున్నారు. ఆసుపత్రి అభివృద్ధికి కృషిచేస్తామని కమిటీ చెప్పినట్లు ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన తెలిపారు.